నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 30-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 251 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఉప్పర్‌పల్లి ర్యాంప్‌లను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , మే 29: నగరంలోని పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై రెండు ర్యాంపులు అందుబాటులోకి వచ్చాయి. సీఎన్ సోమేశ్‌కుమార్‌తో కలిసి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఉప్పర్‌పల్లిలో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ ర్యాంప్‌లను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, యెగ్గె మల్లేశం, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రూ. 22 కోట్లతో అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 164 దగ్గర ర్యాంపుల నిర్మాణం జరిగింది.

ఈ ర్యాంపుల అందుబాటుతో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లే ప్రయాణికులు ఉప్పర్‌పల్లి వద్ద దిగి టోలీచౌకి, ఐటీ కారిడార్, ఇతర ప్రాంతాలకు చేరుకోవచ్చు. అదేవిధంగా ఉప్పర్‌పల్లి వద్ద రెండవ ర్యాంప్‌ను ఉపయోగించి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా ఆర్‌జీఐఏకు చేరుకోవచ్చు. ఈ ర్యాంపుల అందుబాటుతో రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి, బుద్వేల్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ తగ్గనుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరోనా వ్యాక్సిన్ రెండో డోస్ తీసుకున్న మంత్రి సత్యవతి

హైదరాబాద్ , మే 29: కరోనా కట్టడికి సీఎం కేసీఆర్ దేశంలో ఎవరూ తీసుకోని గొప్ప నిర్ణయాలు తీసుకోవడం సత్ఫలితాలు ఇస్తున్నాయని గిరిజన, సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. కొవిడ్ స్ప్రెడర్స్ కు మొదటగా వ్యాక్సిన్ ఇవ్వాలనడం ఇందులో భాగమేనని, ఇందుకు సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మంత్రి తెలిపారు. జడ్పీ చైర్ పర్సన్ కుమారి బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, అధికారులతో కలిసి కొవిడ్ స్ప్రెడర్ వ్యాక్సిన్ కేంద్రాన్ని సందర్శించారు.

రెండో దశ కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నారు. మంత్రితో పాటు జడ్పీ చైర్మన్ వ్యాక్సిన్ తీసుకున్నారు. దీంతో పాటు కొవిడ్ స్ప్రెడర్స్ కు ఇచ్చే వ్యాక్సిన్ కేంద్రం లో రోగులను పరామర్శించారు. వారికి జాగ్రత్తలు చెప్పారు.

ప్రజల ప్రాణాలే ముఖ్యమని భావించి లాక్ డౌన్ విధించడం వల్ల లాక్ డౌన్ కు ముందు 33,34 శాతంగా ఉన్న కొవిడ్ నేడు 8,9 శాతానికి తగ్గిందన్నారు. కొవిడ్ ను కట్టడి చేసేందుకు లాక్ డౌన్ విధించడంతో పాటు కొవిడ్ బారిన పడ్డ వారికి ప్రభుత్వ హాస్పిటల్ లో మెరుగైన వైద్యం అందించేందుకు తీసుకున్న చర్యల వల్ల కూడా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సీఎం ఆలోచనకనుగుణంగా కొవిడ్ బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బందికి ధన్యవాదాలు అన్నారు. కొవిడ్ కష్టకాలంలో కూడా రైతుకు ఇబ్బంది ఉండకూడదని సీఎం కేసీసిఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, ఈ కొనుగోలును అనుకున్న సమయంలో పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా వానాకాలం పంటల సమయం వచ్చినందున రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, నీటి సరఫరాలో, కరెంటు విషయంలో సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. దీనిపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, నేతలతో కలిసి సమీక్ష చేస్తానని చెప్పారు.

మహబూబాబాద్ లో గ్రామాల్లో కొవిడ్ ను కట్టడి చేసేందుకు 450 కమిటీలు పనిచేస్తున్నాయని, ఈ కమిటీలు కొవిడ్ లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి వారికి వైద్యం అందించే కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

ఆర్బీఐ ఆదేశాలతో సుప్రీం కోర్టును ఆశ్రయించిన బ్యాంక్స్?

ఢిల్లీ, మే 29: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) తాజాగా జారీ చేసిన ఆదేశాలు.. బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేస్తున్నాయి. రిజర్వుబ్యాంకు జారీ చేసిన ఆదేశాలను ఏ మాత్రం అమలు చేయలేమని బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. వాటిని అమలు చేయాల్సిన పరిస్థితి ఎదురైతే అత్యంత సున్నితమైన, బ్యాంకు ఆర్థిక లావాదేవీలతో ముడిపడిన విషయాలన్నీ బహిర్గతమౌతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. రిజర్వుబ్యాంకు జారీ చేసిన ఆదేశాలపై స్టే ఇవ్వాలంటూ ఏకంగా దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి బ్యాంకులు. బ్యాంకులకు సంబంధించిన ఆర్థికపరమైన లావాదేవీల డేటాను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకుని రావాలంటూ ఇటీవలే రిజర్వుబ్యాంకు ఆదేశించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులను దీని పరిధిలోకి తీసుకొచ్చింది. ఏ ఖాతాదారుడైనా లేక ఖాతేతరుడైనా సంబంధిత బ్యాంక్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను తనకు అందజేయాలంటూ సమాచార హక్కు చట్టం కింద కోరితే.. దాన్ని అంగీకరించాలంటూ ఆర్బీఐ ఆదేశించింది. సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారుడి కోరిక ప్రకారం.. వారడిగిన వివరాలను అందజేయాలని సూచించింది.

చరిత్రలో నేటినిజం

ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను పరామర్శించిన మంత్రి అల్లోల

మెట్‌పల్లి/ కరీంనగర్ : తండ్రి మరణంతో విషాదంలో ఉన్న ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శనివారం పరామర్శించారు. మెట్‌పల్లి పట్టణ సమీపం రేగుంటలోని బాల్క సుమన్ ఇంటికి వచ్చిన మంత్రి ఆయనను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాల్క సురేష్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. మంత్రి వెంట టీఆర్ఎస్ నాయకులు రాంకిషన్ రెడ్డి, శ్రీహరి రావు, తదితరులు ఉన్నారు.

అక్కడ జూన్ 7 వరకు కర్ఫ్యూ పొడిగింపు

పనాజీ, మే 29: : దేశంలో కరోనా మహమ్మారి ప్రభావం కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ రోజువారీగా నమోదయ్యే కొత్త కేసుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. గోవాలోనూ కొత్త కేసుల సంఖ్య తగ్గింది. కేసుల సంఖ్య తగ్గుతున్నప్పటికీ గోవా ప్రభుత్వం కరోనా మహమ్మారి కట్టడి కోసం కీలక నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే అమల్లో ఉన్న కర్ఫ్యూ నిబంధనలను మరో ఏడు రోజుల వరకు పొడిగించాలని నిర్ణయించింది. జూన్ 7న ఉదయం 7 గంటల వరకు గోవాలో కర్ఫ్యూ అమల్లో ఉంటుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

పర్యావరణ పరిరక్షణకు మూడు చారిత్రక నిర్ణయాలు

న్యూఢిల్లీ, మే 29: పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా మూడు చారిత్రక నిర్ణయాలు వెలువడ్డాయి. ఎనిమిది మంది పిల్లలు దాఖలు చేసిన పిటిషన్లో బొగ్గు గనిని నిషేధించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వాన్ని అక్కడి కోర్టు ఒకటి ఆదేశించింది. ఇదే సమయంలో అమెరికా, నెదర్లాండ్స్ ప్రభుత్వాలు చమురు కంపెనీలను మందలించాయి.

పర్యావరణ పరిరక్షణ గురించి ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ ఫెడరల్ కోర్ట్ చారిత్రక నిర్ణయం తీసుకున్నది. బొగ్గు గనిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా దాఖలైన కేసులో పిటిషనర్లు అయిన 8 మంది చిన్నారులకు అనుకూలంగా తీర్పు వెలువడింది. పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న బొగ్గు గనుల తవ్వకాన్ని నిషేధించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వాన్ని ఫెడరల్ కోర్టు మోర్దెసాయ్ బ్రోంబెర్గ్ ఆదేశించారు.

అమెరికాలో ప్రసిద్ధ చమురు కంపెనీలైన ఎక్సాన్ మొబిల్, చెవ్రాన్లను జో బైడెన్ ప్రభుత్వం మందలించింది. గ్లోబల్ వార్మింగ్ కు అవసరమైన చర్యలు తీసుకోనందుకు పెట్టుబడిదారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెవ్రాన్ పెట్టుబడిదారులలో మూడింట రెండొంతుల మంది ఉద్గారాలను తగ్గించాలని ఒత్తిడి చేశారు. నెదర్లాండ్ కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. పారిస్ ఒప్పందం తర్వాత 10 సంవత్సరాలలో ఉద్గారాలను 45 శాతం తగ్గించాలని చమురు కంపెనీ షెల్, ఇతరులు కోరారు. శిలాజ ఇంధనాలను తీయడాన్ని కూడా నిషేధించారు. ఈ విషయం మొత్తం ప్రపంచానికి వర్తిస్తుందని నెదర్లాండ్స్ కోర్టు వెల్లడించింది.

థర్‌వేవ్ ముట్టడిస్తే ఢిల్లీలో రోజుకు 45 వేల కేసులు

న్యూఢిల్లీ, మే 29: సెకండ వేవ్ ముగిసిపోతున్న సూచనల మధ్య ఢిల్లీలో లాక్‌డౌన్ సడలింపుల గురించి ఆప్ సర్కారు ఆలోచిస్తున్నది. కానీ థర్డ్‌వేవ్ ముప్పు పొంచి ఉన్నదని ఐఐటీ-ఢిల్లీ ఒక అధ్యయన నివేదికలో హెచ్చరించింది. ఈ వేవ్‌లో రోజుకు 45 వేల కేసులు రావచ్చని, 9 వేల మందికి హాస్పిటల్ బెడ్ అవసరం కావచ్చని నివేదిక తెలిపింది. శుక్రవారం ఈ నివేదికను ఢిల్లీ హైకోర్టుకు సమర్పిం చారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవాలంటే రోజుకు 944 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అవసరమని సూచించింది. న్యాయమూర్తులు విపిన్ సంఘీ, జస్మీత్ సింగ్‌తో కూడిన ధర్మాసనం నివేదికలో చేసిన సిఫారసులపై నాలుగు వారాల్లోగా కార్యాచరణ పట్టికను సమర్పించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆక్సిజన్ కేంద్రాల వికేంద్రీకరణ అనేది నివేదికలోని కీలక సిఫారసుల్లో ఒకటని కోర్టు అభిప్రాయపడింది. ఒకే చోట ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పి సిలిండర్లు రవాణా చేసే బదులు దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ ఆక్సిజన్ యూనిట్లు నెలకొల్పాలని నివేదిక సూచించింది. శతాబ్దానికి ఒకసారి వచ్చే మహాగత్తరను ఎదుర్కొంటున్నాం.. చివరిసారిగా 1920లో ఇలాంటిది వచ్చింది. ఆక్సిజన్ ఉత్పాదక కేంద్రం నెలకొల్పడానికి ఢిల్లీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. దానివల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. దీనివల్ల నిల్వచేయడం, రవాణా, ఆవిరై పోవడం వంటి ఎన్నో సమస్యలు తగ్గిపోతాయి.

రానున్న మూడురోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్ , మే 29: రాష్ట్రంలో రాగల మూడురోజుల్లో తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ వరకు సముద్ర మట్టానికి 1.5-2.1 కిలోమీటర్ల ఎత్తున ఉపరిత ద్రోణి ఆవరించి ఉంది. పశ్చిమ, వాయవ్య దిశల నుంచి రాష్ట్రంలోకి కిందస్థాయి గాలులు విస్తున్నాయి. వీటి ప్రభావంతో రానున్న మూడురోజుల్లో రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. జూన్ 10 లోపు రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశముందని పేర్కొంది.

మంటల్లో ఆక్సిజన్ ట్యాంకర్ దగ్ధం

పెద్దపల్లి, మే 29: : హైదరాబాద్ నుండి కర్ణాటకలోని రాయచూర్‌కు ఆక్సిజన్ ట్యాంకర్స్‌ను తీసుకువెళ్తున్న రైలు పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని చికురాయ్ వద్ద అగ్నిప్రమాదానికి గురైంది. ఆక్సిజన్ రైలు చికురాయ్ చేరుకోవడంతో ట్యాంకర్లలో ఒకదానిలో మంటలు చెలరేగాయి. 38 నంబర్ రైల్వే గేట్ వద్ద రైలును ఆపి రైల్వే అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఎగసిపడుతున్న మంటలను నియంత్రించారు. ట్యాంకర్ పైభాగంలో లైవ్ ఎలక్ట్రిక్ వైర్ ఉండటంతో అధికారులు ఆందోళన చెందారు. అయినప్పటికీ అగ్నిమాపక సేవా సిబ్బంది మంటలను నియంత్రించగలిగారు. అగ్నిప్రమాదానికి గల కారణం తెలియనప్పటికీ బ్రేక్‌లు వేసినప్పుడు మంటలు చెలరేగవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.

క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దు : రాచకొండ సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్ , మే 29: క్షణకావేశంలో ప్రాణాలు తీసుకోవద్దని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ సూచించారు. శనివారం ప్రేమ విఫలమై శివ అనే యువకుడు సరూర్‌నగర్ లేక్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. ఇది గమనించిన హోంగార్డ్ మంత్రి ఈశ్వరయ్య గమనించి, రక్షించాడు. తర్వాత అతనికి ప్రథమ చికిత్స అందించి.. యువకుడిని అతని సోదరునికి అప్పగించాడు. ఈ సందర్భంగా హోంగార్డును కార్యాలయంలో సీపీ మహేశ్ భగవత్ అభినందించి, నగదు పారితోషకం అందజేశారు. ప్రధానమంత్రి సేవ్ లైఫ్ పతకానికి ఈశ్వరయ్య పేరును సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సరూర్‌నగర్ లేక్ వద్ద రెండేళ్ల కింట అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి నిఘా పెంచినట్లు సీపీ తెలిపారు. ఇప్పటి వరకు ఆత్మహత్యకు యత్నించిన ఆరుగురిని రక్షించినట్లు పేర్కొన్నారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దని సూచించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో సైకాలజీ సెంటర్ ఏర్పాటు చేశామని, సేవలను వినియోగించుకోవాలన్నారు. కాల్ సెంటర్ 040-48214800ను సంప్రదించవచ్చని చెప్పారు.

ప్రశాంతంగా లాక్‌డౌన్

కమిషనరేట్ పరధిలో లాక్‌డౌన్ ప్రశాంతంగా సాగుతోందని సీపీ మహేశ్ భగవత్ తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 52 చెక్‌పోస్టులు చేసినట్లు చెప్పారు. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకే గూడ్స్ వాహనాలకు అనుమతి ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 56,466 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘనలపై 41,990 కేసులు, మాస్క్‌లు ధరించని 11,638 మందిపై, గ్యాదరింగ్‌పై 601, భౌతికదూరం పాటించని 1,823 మందిపై, బహిరంగంగా మద్యం తాగిన వారిపై 414 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే లాక్‌డౌన్ సమయంలో అనవసరంగా బయటకు వచ్చిన 13,490 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు.

కేరళకు 100 కి.మీ దూరంలో నైరుతి రుతుపవనాలు

న్యూఢిల్లీ, మే 29: నైరుతి రుతుపవనాలు కేరళ-తమిళనాడుకు చాలా దగ్గరగా ఉన్నాయి. రుతుపవనాల ఉత్తర పరిమితి ప్రస్తుతం కొమొరిన్ సముద్రంలోని తీరాల నుంచి 100 కి.మీ. దూరంలో ఉన్నాయి. రానున్న 24 గంటల్లో ఎప్పుడైనా చేరుకోవచ్చునని పర్యావరణవేత్తలు చెప్తున్నారు. గత చాలా రోజులుగా దక్షిణ-పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వర్షం, గాలి, రేడియేషన్ యొక్క అనేక పారామితులను కలుపుకున్న తర్వాత రుతుపవనాలు కేరళకు చేరుకున్నట్లు నిర్ధారించారు.

వాతావరణ శాఖ ప్రకారం.. కేరళ, లక్షద్వీప్, కర్ణాటకలోని 14 వాతావరణ కేంద్రాలలో 60 శాతం మే 10 తర్వాత వరుసగా రెండు రోజులు 2.5 మిమీ లేదా అంతకంటే ఎక్కువ వర్షం వస్తే రుతుపవనాల రాకకు ప్రధాన స్థావరంగా పరిగణించబడుతుంది. తీరప్రాంతమైన కేరళ, కర్ణాటక, లక్షద్వీప్‌లలో వర్షాల వల్ల దీనికి పూర్తి ఆధారం చేకూరినట్లయింది. అయితే, గాలి, రేడియేషన్ ప్రమాణాలు నిరంతరం నిఘాలో ఉన్నాయి.

భారతదేశంలోని అండమాన్, నికోబార్ దీవుల్లో రుతుపవనాలు మే 21 న తాకాయి. ఆ తర్వాత సాధారణ వేగంతో వాయవ్య దిశలో కదులుతున్నాయి. కేరళలో రుతుపవనాలు ప్రారంభమయ్యే సాధారణ తేదీ జూన్ 1. అయితే వాతావరణ శాఖ మే 31 న ప్రవేశిస్తుందని అంచనా వేశారు. ఇదే సమయంలో ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్.. మే 30 న రుతుపవనాలు మన దేశంలోకి ప్రవేశిస్తాయని అంచనా వేసింది.

ఈసారి సాధారణం కన్నా మంచి వర్షాలు

ఈసారి రుతుపవనాలు సాధారణం కంటే మెరుగ్గా ఉంటాయని భావిస్తున్నారు. స్కైమెట్ ప్రకారం, ఈ సంవత్సరం జూన్ నుంచి సెప్టెంబర్ వరకు భారతదేశంలో సగటు వర్షపాతం 907 మి.మీ ఉండనున్నది. భారతదేశం అంతటా నాలుగు నెలల్లో సగటు వర్షపాతం 880.6 మిల్లీమీటర్లు.

పలమనేరు హత్య కేసు- విచారణలో సంచలన విషయాలు

అమరావతి, మే 29: చిత్తూరు జిల్లా పలమనేరులో సంచలనం సృష్టించిన ధనశేఖర్ అనే యువకుడి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ధనశేఖర్ ను బాబు అనే వ్యక్తి కిరాతకంగా చంపేసిన ముక్కలుగా నరికేసి తన పొలంలో పాతిపెట్టాడు. నాలుగు రోజుల తర్వాత బయటపడ్డ ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పొలంతో పాతిపెట్టిన అవయవాలను వెలికితీసిన పోలీసులు వాటిని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తన కూతురిని ప్రేమించాడనే కారణంతోనే ధనశేకర్ ను శైలజ తండ్రి హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో శైలజ తండ్రి బాబు (49) , భార్య సుజాత (40), మైనర్ బాలిక శైలజ (16) పై 302 కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు.

చిత్తూరు జిల్లా పలమనేరు డీఎస్పీ గంగయ్య కథనం ప్రకారం.. పలమనేరు మండలం పెంగరగుంట గ్రామానికి చెందిన ధనశేఖర్(23)బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పక్కింట్లో ఉండే శైలజ(16)ను కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. లాక్‌డౌన్ కారణంగా ఉపాధి లేకపోవడంతో శేఖర్ గతవారం గ్రామానికి వచ్చేశాడు. అయితే, తన కూతురిని ప్రేమిస్తున్నాడని తెలుసుకున్న బాబు ఈ నెల 22న తను ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు బాలిక తన తండ్రి ఫోన్ ద్వారా అతడికి మెసేజ్ చేసింది. దీంతో ఆమె ఇంటికి వెళ్లి ఏకాంతంగా ఉన్న సమయంలో బాలిక తండ్రి బాబు ఇంటికి వచ్చాడు. తన కూతురితో గదిలో ఉన్న ధనశేఖర్‌ను చూసి బాబు ఆవేశంతో రగిలిపోయాడు. ధనశేఖర్‌ను బాబు వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ కత్తితో అత్యంత పాశవికంగా నరికి చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని తన వ్యవసాయ బావిలో పడేశాడు.

మూడు రోజుల తరువాత మృతదేహం ఉబ్బిపోయి పైకి తేలింది. దీంతో హత్య గురించి అందరికీ తెలిసిపోతుందని భావించిన బాబు.. మృతదేహాన్ని బయటకి తీసి ముక్కలుగా చేసి తన పొలంలో పూడ్చి పెట్టాడు. కొడుకు కనిపించకపోవడంతో ధనశేఖర్ తండ్రి ఈనెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాబుపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శేఖర్ కాల్‌డేటాను విశ్లేషించి బాలిక తండ్రే ఈ హత్య చేసినట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఎంత కిరాతకంగా హత్య చేసిందీ పూసగుచ్చినట్లు వివరించాడు. దీంతో పోలీసులు శుక్రవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ధనశేఖర్‌ను హత్య చేసిన బాబుతో పాటు ఆయనకు సహకరించిన అందర్నీ అరెస్టు చేస్తామని డీఎస్పీ గంగయ్య స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి బాబుతో పాటు ఆయన భార్య, కుమార్తెను కూడా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

ఎయిర్ గన్ కలకలం-చంపేస్తానంటూ డిప్యూటీ తాహసీల్దార్ హల్ చల్

హైదరాబాద్ , మే 29: వికారాబాదులో ఎయిర్ గన్ కలకలం రేపింది. షేక్ ఫయాజ్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఎయిర్ గన్ పట్టుకొని హల్చల్ సృష్టించాడు. వికారాబాద్ డిప్యూటీ తాహసీల్దారు సివిల్ సప్లైస్ లో ఫయాజ్ పని చేస్తున్నాడు. నిన్న రాత్రి మద్యం సేవించి అనంతరం మద్యం మత్తులో ఇంటి పక్కన ఉన్న టోనీతో ఫయాజ్ వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన ఫయాజ్ ఒక్కసారిగా ఎయిర్ గన్ తీసుకో వచ్చి కలకలం రేపాడు. గన్‌తో కాల్చి చంపేస్తామంటూ హల్చల్ సృష్టించాడు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. షేక్ ఫయాజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సౌందరరాజన్‌కు 'సంప్రదాయ సంరక్షణ దీప' బిరుదు

హైదరాబాద్ , మే 29: 85 ఏళ్ల వయసులో చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు ఎంవీ సౌందరరాజన్ 'సంప్రదాయ సంరక్షణ దీప' అనే బిరుదును సొంతం చేసుకున్నారు. రాజకీయ, వాణిజ్య అంశాలకు వ్యతిరేకంగా ఆలయ వ్యవస్థను సంరక్షించడం ద్వారా ధర్మ రక్షణలో సౌందరరాజన్ చేసిన నిరంతర సేవలకు ఈ బిరుదును ప్రదానం చేశారు. శ్రీ గోపాలదేసికా మహాదేశికన్ జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శ్రీరంగంకు చెందిన పౌండరీకాపురం శ్రీమద్ అండవన్ ఆశ్రమ నిర్వాహకులు ఈ బిరుదుతో సౌందరరాజన్‌ను సత్కరించారు.

చిలుకూరు ఆలయంలో హుండీ సంప్రదాయాన్ని తొలగించిన ఘనత సౌందరరాజన్‌కు దక్కుతుంది. వీఐపీ దర్శనం అనేది లేకుండా భక్తులందరికీ ఒకే క్యూ లైన్‌లో దర్శనం కల్పించారు. టికెట్ విధానం లేకుండా, ఆర్జిత సేవలు లేకుండా, నగదు సమర్పణలు లేకుండా చిలుకూరు ఆలయంలో సౌందరరాజన్ పలు సంస్కరణలను ప్రవేశపెట్టారు. కాగా ఎంకామ్, ఎల్ఎల్‌బీ, కామర్స్‌లో డాక్టరేట్ పొందిన సౌందరరాజన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1981లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. వంశపారంపర్య క్రమంలో ఆలయ ధర్మకర్తగా, అర్చకుడిగా ఉంటూ సౌందరరాజన్ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టారు.

కల్లు కోసం ఆస్పత్రి నుంచి పరారైన కరోనా రోగి

కామారెడ్డి, మే 29: జిల్లా బాన్సువాడలో ఓ కరోనా రోగి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. పిట్లం మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తికి ఇటీవల కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో అతడిని కుటుంబీకులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అయితే బుధవారం ఉదయం కరోనా రోగి ఆస్పత్రి నుంచి పారిపోయాడు. రెగ్యులర్ చెకప్‌కు వచ్చే వైద్య సిబ్బంది ఈ విషయం తెలుసుకుని అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు బాన్సువాడ పట్టణంలో కరోనా రోగి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలించారు. చివరకు అతడు సంగమేశ్వర కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద ఓ మూలన అర్ధనగ్నంగా కూర్చుని కనిపించాడు. ఆస్పత్రి నుంచి ఎందుకు పారిపోయావని పోలీసులు నిలదీయగా.. తనకు తాగడానికి కల్లు దొరకలేదని, అందుకే పారిపోయి వచ్చానని కరోనా పేషెంట్ చెప్పాడు. పోలీస్ సిబ్బంది అంబులెన్సులో ఎక్కించేందుకు యత్నించగా.. ఆస్పత్రికి రానంటూ అతడు మొండికేశాడు. తనకు కల్లు కావాలని తెగేసి చెప్పాడు. దీంతో పోలీసులు చేసేదేమీ లేక.. రెండు లీటర్ల కల్లు తెప్పించి కరోనా బాధితుడికి ఇచ్చారు. అది తాగిన తర్వాత అతడిని ప్రభుత్వ క్వారంటైన్ కేంద్రానికి తరలించారు.

యాస్ చక్రవాతం కారణంగా వాటిల్లిన నష్టంపై సమీక్షను నిర్వహించిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ , మే 29: యాస్ చక్రవాతం కారణం గా ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల దగ్గరి సంబంధికులకు 2 లక్ష ల రూపాయలు, గాయపడ్డ వ్యక్తుల కు 50,000 రూపాయలు వంతు న పరిహారాన్ని భారతదేశం వ్యాప్తం గా బాధితులందరికీ ఇవ్వడం జరుగుతుంది

యాస్ చక్రవాతం వల్ల తలెత్తిన స్థితి ని సమీక్షించడం కోసం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఒడిశా ను, పశ్చిమ బంగాల్ ను 2021 మే నెల 28 న సందర్శించారు. ఒడిశా లోని భద్రక్, బాలేశ్వర్ జిల్లాల తో పాటు పశ్చిమ బంగాల్ లోని పూర్వ మేదినీపుర్ జిల్లా లో గాలివాన వల్ల ప్రభావితమైన ప్రాంతాలను ఆయన విమానం ద్వారా పరిశీలించారు.

చేపడుతున్న సహాయం, పునరావాస సంబంధి ఏర్పాటుల ను సమీక్షించడం కోసం భువనేశ్వర్ లో నిర్వహించిన ఒక సమావేశానికి ప్రధాన మంత్రి అధ్యక్షత వహించారు.

యాస్ చక్రవాతం కారణం గా ఒడిశా లో గరిష్ఠ స్థాయి నష్టం వాటిల్లిందని, పశ్చిమ బంగాల్ లోని కొన్ని ప్రాంతాల తో పాటు ఝార్ ఖండ్ లోను కొన్ని ప్రాంతాలు కూడాను ప్రభావితం అయ్యాయని ప్రధాన మంత్రి కి వివరించడం జరిగింది.

తక్షణ సహాయక కార్యకలాపాల కు గాను శ్రీ నరేంద్ర మోదీ 1000 కోట్ల రూపాయల మేరకు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఒడిశా కు వెంటనే 500 కోట్ల రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. మరొక 500 కోట్ల రూపాయల సాయాన్ని పశ్చిమ బంగాల్ కు, ఝార్ ఖండ్ కు ప్రకటించడమైంది. ఈ సొమ్ము ను వాటిల్లిన నష్టాలు ప్రాతిపదిక గా విడుదల చేయడం జరుగుతుంది. నష్టం పరిమాణాన్ని అంచనా వేయడానికి గాను వివిధ మంత్రిత్వ శాఖ ల సభ్యులతో కూడిన ఒక బృందాన్ని కేంద్ర ప్రభుత్వం పంపనుంది. ఈ మదింపు ను ఆధారం గా చేసుకొని సాయం రాశి ని పెంచడం జరుగుతుంది.

ఈ కష్ట కాలం లో కేంద్ర ప్రభుత్వం ఒడిశా, పశ్చిమ బంగాల్, ఝార్ ఖండ్ రాష్ట్రాల ప్రభుత్వాల తో కలిసికట్టుగా కృషి చేస్తుంది, ప్రభావిత ప్రాంతాల లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ కు, పునర్ నిర్మాణానికి చేతనైన అన్ని విధాలు గాను సాయపడుతుంది అంటూ ఆయా రాష్ట్రాల ప్రజల కు ప్రధాన మంత్రి హామీ ని ఇచ్చారు.

చక్రవాతం కారణంగా తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబాల కు ప్రధాన మంత్రి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ విపత్తు సందర్భం లో బాధితులైన వ్యక్తులు అందరికీ తన పూర్తి అండదండలు ఉంటాయని ఆయన తెలియజేశారు.

చక్రవాతం లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల దగ్గరి సంబంధికుల కు 2 లక్షల రూపాయలు, గాయపడ్డ వ్యక్తుల కు 50,000 రూపాయలు వంతు న పరిహారాన్ని ఇవ్వడం జరుగుతుందని ఆయన ప్రకటించారు.

విపత్తుల వేళల్లో శాస్త్రీయ సంబంధి నిర్వహణ పై మరింత అధిక శ్రద్ధ తీసుకొంటూ ఉండడాన్ని మనం కొనసాగించవలసి ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. అరేబియా సముద్రం లో, బంగాళాఖాతం లో చక్రవాతం తాలూకు స్థితిగతులు తరచు గా ఉత్పన్నం అవుతూ వాటి ప్రభావం పెచ్చుపెరుగువుతున్న నేపథ్యం లో నష్టాలను తగ్గించే ప్రయాసల లోను, తత్సంబంధి సన్నాహాల పరంగాను, కమ్యూనికేషన్ సిస్టమ్స్ పరంగాను ఒక పెద్ద మార్పు చోటు చేసుకోవలసిన అవసరం ఉంది అని ఆయన అన్నారు. సహాయక చర్యల లో మెరుగైన సహకారాన్ని అందించే విషయం లో ప్రజల లో విశ్వాసాన్ని కలిగించేందుకు కూడాను పెద్ద పీట వేయవలసి ఉంది అని ఆయన సూచన చేశారు.

ఒడిశా ప్రభుత్వం నడుం కట్టిన సన్నాహక చర్య లు, విపత్తు నిర్వహణ కార్యకలాపాల ఫలితం గా ప్రాణనష్టం కనీస స్థాయి కి పరిమితం అయింది అంటూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మెచ్చుకొన్నారు. ఈ తరహా ప్రాకృతిక సంకటాల ను సంబాళించడం కోసం రాష్ట్రం దీర్ఘకాలిక ఉపశమన ప్రయాసల ను మొదలుపెట్టింది అని కూడా ఆయన అన్నారు.

విపత్తు ప్రభావాన్ని తగ్గించే దిశ లో 30,000 కోట్ల రూపాయల మేరకు నిధుల ను ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక సంఘం సైతం విపత్తు ల ఉపశమనానికి సాగవలసిన కృషి ని మనసు కు హత్తుకొనేటట్టు చెప్పింది అని ఆయన ప్రస్తావించారు.

మిషన్ కోవిడ్ సురక్ష కింద కొవాగ్జిన్ తయారీకి ప్రధాన ముడి పదార్థాన్ని (డ్రగ్ సబ్‌స్టాన్స్) జూన్ నెల నుంచి ఉత్పత్తి

న్యూఢిల్లీ, మే 29: వ్యాక్సిన్ ఉత్పత్తిని పెంచే ప్రయత్నంలో భాగంగా, మిషన్ కోవిడ్ సురక్ష కింద కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో ఒకటి నేషనల్ డైరీ డెవలప్ మెంట్ బోర్డ్ కు చెందిన ఇండియన్ ఇమ్యునలాజికల్ లిమిటెడ్ (ఐఐఎల్).భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం 'కొవాగ్జిన్' టీకా మందును తన యూనిట్లో తయారు చేసి అందించడానికి హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) సన్నద్ధమవుతోంది. భారత్ బయోటెక్ లిమిటెడ్ తయారు చేస్తున్న కొవాగ్జిన్ తయారీలో ప్రధాన ముడి పదార్థాన్ని (డ్రగ్ సబ్‌స్టాన్స్) ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) జూన్ 15 న ఉత్పత్తిని ప్రారంభించి, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ కు టీకా తయారీకి జులై చివరకి అందజేస్తుందని ఐఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఆనంద కుమార్ తెలిపారు. ఈ మేరకు మొదట్లో 2-3 మిలియన్ వ్యాక్సిన్ డోసుల కోసం డ్రగ్ సబ్‌స్టాన్స్ ను అందిస్తామని, ఆ తర్వాత కాలంలో దీన్ని 6-7 మిలియన్లకు పెంచుతామని, ఏడాది చివరి నాటికి 10-15 మిలియన్ల వరకు అందజేస్తామని డా. ఆనంద కుమార్ తెలిపారు. ఐఐఎల్, జాతీయ పాడి అభివృద్ధి మండలిలో అంతర్భాగంగా పిల్లలు, జంతువుల వాక్సిన్ లపై పనిచేస్తోంది. హైదరాబాద్ సమీపంలోని ఐఐఎల్,కరకపట్ల తయారీ విభాగాన్ని బయో సేఫ్టీ లెవల్-త్రీ యూనిట్ గా మారుస్తున్నట్లు, అదనంగా మరో ఉత్పాదక యూనిట్ నిర్మాణం కూడా చేపట్టామని డా. ఆనంద కుమార్ తెలిపారు. కోవిడ్-19 లైవ్ వైరస్ ఆధారిత కొత్త వ్యాక్సిన్ ను తయారు చేసినట్లు కూడా ఐఐఎల్ ఎం.డి డాక్టర్ ఆనంద్ కుమార్ చెప్పారు. ప్రస్తుతం ఇది జంతువులపై ప్రయోగించే దశలో ఉందని, వచ్చే ఏడాదికి మానవులపై వినియోగించవచ్చని ఆయన చెప్పారు.ఆత్మ నిర్భర్ భారత్ 3.0 లో భాగంగా మిషన్ కోవిడ్ సురక్ష కింద దేశీయ వాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి కేంద్ర బయోటెక్నాలజీ విభాగం ఇండియన్ ఇమ్యూనలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్), హైదరాబాద్ -కి రూ. 60 కోట్ల గ్రాంట్ గా ఆర్థిక మద్దతు ను అందించింది.

అతి తక్కువ జీఎస్టీ పరిహారం తీసుకుంటున్నది తెలంగాణే : మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ , మే 29: దేశంలో కేంద్రం నుంచి అతి తక్కువ జీఎస్టీ పరిహారం తీసుకుంటున్న రాష్ట్రం తెలంగాణనే అని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అన్నిరాష్ట్రాల ఆర్థిక లోటు 36.3 శాతం ఉండగా, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక లోటు 23.10 శాతంగా ఉందని ఆయన తెలిపారు. కరోనా నేపథ్యంలో రాష్ట్ర ఆదాయం భారీగా తగ్గిందని, ఖర్చులు అధికంగా పెరిగాయని పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ప్రజారోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తున్నదని మంత్రి తెలిపారు.

ఈ పరిస్థితుల్లో ఎఫ్ఆర్బీఎం పరిధిని 3 శాతం నుంచి 5 శాతానికి పెంచాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఐజీఎస్టీ నిధులు గతేడాది రూ. 2,638 కోట్లు వచ్చాయని వెల్లడించారు. ఈ ఏడాది ఐజీఎస్టీ నిధులు రూ. 13 వేల కోట్ల నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ. 218 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులు బాగాలేకపోవడం, పరిహారం ఇచ్చేందుకు ఇదే చివరి ఏడాది అయినందున పూర్తి పరిహారం చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌లో సభ్యత్వం ఇవ్వాలని హరీశ్ రావు కోరారు.

న్యూట్రల్ ఆల్కహాల్‌ను జీఎస్టీ నుంచి మినహాయించాలి..

న్యూట్రల్ ఆల్కహాల్‌ను జీఎస్టీ నుంచి మినహాయించాలని మంత్రి కోరారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పరిధిలోకి రాకుండా రాష్ట్రాలకు వదిలినవి ఎక్సైజ్, పెట్రోల్ అండ్ డీజిల్ మాత్రమేనని అన్నారు. రాష్ట్రాల నుంచి కేంద్రానికి ఎక్కువగా ఆదాయం వస్తోంది సెస్, సర్ ఛార్జీల రూపంలోనేనని గుర్తుచేశారు. గత బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వ రెవెన్యూలో 18శాతం సర్ ఛార్జీ, సెస్‌ల రూపంలో వచ్చిందేనని అన్నారు.

కేంద్రం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్ ఛార్జీల ద్వారా రాష్ట్రాలు 41 శాతం ఆదాయం కోల్పోతున్నాయని తెలిపారు. తెలంగాణ యేటా రూ.3439 కోట్ల ఆదాయం కోల్పోతుందని చెప్పారు. అన్నిరాష్ట్రాల మంత్రులు కోరుతున్నట్లు జీఎస్టీ నుంచి ఆల్కహాల్‌ను మినహాయించాలని కోరారు. న్యూట్రల్ ఆల్కహాల్‌ను జీఎస్టీ పరిధి నుంచి శాశ్వతంగా మినహాయించేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అందరికీ ఉచితంగా వ్యాక్సిన్

-కలెక్టరేట్‌లో కొవిడ్ నియంత్రణ,ధాన్యం కొనుగోళ్లు, రెండో పంటపై సమీక్ష

జనగామ, మే 29 : విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందాలని, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేశ ప్రజలందరికీ వ్యాక్సిన్ వేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీని పర్యవసానమే సెకండ్ వేవ్‌లో రోగులు, మరణాల సంఖ్య పెరుగుతుందన్నారు. జూన్ మొదటి వారం నుంచి తెలంగాణ ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్ వేసేందుకు సీఎం కేసీఆర్ చొరవతో కార్యాచరణ సిద్ధమైందని చెప్పారు. శుక్రవారం ఆయన జనగామలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సూపర్ స్ప్రెడర్లుగా గుర్తించిన వారికి ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ రాజయ్య, కలెక్టర్ కే నిఖిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం జనగామ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు, కలెక్టర్, జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, అధికారులతో కలిసి జిల్లాలో కొవిడ్ నియంత్రణ, ధాన్యం కొనుగోళ్లు, రెండో పంటకు సాగునీరు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు.

దేవరుప్పుల మండలంలోని ఉన్నత పాఠశాలలో సూపర్ స్ప్రెడర్లకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొవిడ్ కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని, ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల మంది సూపర్ స్ప్రెడర్లను గుర్తించినట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనునిత్యం ప్రజలతో ఉండే వ్యక్తులు లక్షా మూడువేల మంది ఉన్నారని, వారందరికీ శుక్ర, శనివారాల్లో వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. జనగామ జిల్లాలో 1,857 మంది ఉండగా, వారి కోసం మండలానికో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో పడకలు, మందులు, ఆక్సిజన్ కొరత లేదన్నారు. ప్రైవేట్ దవాఖానల్లో ధరలు, పరీక్షలు, ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రజలు వైద్యం కోసం వరంగల్, హైదరాబాద్ వెళ్లకుండా అన్ని సౌకర్యాలు ఉన్న జిల్లా వైద్యశాలల్లోనే చికిత్స పొందేలా నమ్మకం కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరో పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే లక్షా 55వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కష్టకాలంలో సహకరించని రైస్ మిల్లులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.30వేల కోట్లు అప్పుగా తెచ్చి ధాన్యం కొంటున్నామని, కాస్త ఆలస్యమైనా రైతులు పండించిన ధాన్యం మొత్తం కొంటామని చెప్పారు. ఈసారి వర్షాలు ముందస్తుగా కురిసే అవకాశమున్నందున రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలని, రెండో పంటకు నీరిచ్చేందుకు అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు.

కాగా, దేవరుప్పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కామారెడ్డిగూడెం వాస్తవ్యుడు మహ్మద్ గనీమియా కుటుంబ సభ్యులు, యాదాద్రి భువనగిరిలోని ప్రిన్స్‌మెడికల్ హోల్, పీఆర్ ఇంజినీర్ల సహకారంతో ఆక్సిమీటర్లు, థర్మల్‌స్కానర్లను మంత్రి ఎర్రబెల్లి మండలంలోని 32 గ్రామాల ఆశ వర్కర్లకు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీకి స్టీ నిధి సంస్థ ఇచ్చిన నాలుగు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను ప్రారంభించారు. మండలంలో పలు గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, మరో 18 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంత్రి ఎర్రబెల్లి అందజేశారు. జనగామ సమీక్షలో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, అబ్దుల్ హమీద్, ఏసీపీ వినోద్‌కుమార్, ఇంగేషన్ ఎస్ఈ యశస్వి, ఆర్డీవోలు మధుమోహన్, కృష్ణవేణి, డీఎంహెచ్‌వో డాక్టర్ మహేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారిణి రోజారాణి, డీఎంవో నాగేశ్వరశర్మ, డీఆర్‌డీవో రాంరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కరుణశ్రీ, దేవరుప్పుల మండల ప్రత్యేక అధికారి కొండలిరెడ్డి, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీవో ఉమామహేశ్వర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్‌రెడ్డి, జడ్పీటీసీ భార్గవి, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ నర్సింహారెడ్డి, లింగాలఘనపురం మాజీ ఎంపీపీ గణపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి పెరగనున్న విమాన ఛార్జీలు

హైదరాబాద్ , మే 29: జూన్ 1 నుంచి డొమెస్టిక్ విమాన ఛార్జీలు పెరగనున్నాయి. దేశీయ ప్రయాణాలకు సంబంధించి లోయర్ లిమిట్‌ను 15 శాతం పెంచుతున్నట్లు భారత విమానయాన శాఖ ప్రకటించింది. దేశీయ విమానయాన సంస్థలు నష్టాల బాటలో పయనిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కరోనా నేపథ్యంలో, ప్రయాణికులు విమానాల్లో ప్రయాణించడం తగ్గిందని.. దీని వల్ల విమానయాన సంస్థలకు నష్టాలు వస్తున్నాయని చెప్పింది. ఫస్ట్ వేవ్ కంటే సెకండ్ వేవ్ పరిస్థితిని మరింత దిగజార్చిందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఛార్జీలను పెంచాల్సి వచ్చిందని వెల్లడించింది. ఎయిర్ లైన్స్ సంస్థలను కష్టాల నుంచి గట్టెక్కించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. 40 నిమిషాల కంటే తక్కువ ప్రయాణ సమయం ఉండే ప్రయాణాల ఛార్జీలను 13 శాతం అంటే? రూ. 2.300 నుంచి రూ. 2.600కి పెంచుతున్నట్లు విమానయాన శాఖ తెలిపింది. అయితే, ఈ ప్రయాణాలకు గరిష్ఠ ధర మాత్రం రూ. 7,800లకు మించకూడదని చెప్పింది. 40 నిమిషాల నుంచి 60 నిమిషాల ప్రయాణాల ఛార్జీని రూ. 2,900 నుంచి రూ. 3,300కు పెంచినట్లు తెలిపింది. గరిష్ఠ ఛార్జీ రూ. 9,800కు మించకూడదని చెప్పింది. ఇదే సమయంలో అప్పర్ లిమిట్ ఛార్జీలలో మాత్రం ఎలాంటి మార్పులు లేవని ప్రకటించింది.

లాక్ డౌన్‌లో నిర్విరామంగా తోట రామ్ కుమార్ ట్రస్ట్ సేవలు

రాజన్న సిరిసిల్ల మే, 29(నేటినిజం ప్రతినిధి): .కరోనా నివారణకు ప్రభుత్వం లాక్ డౌన్ ను విధించడం తో సామాన్య ప్రజలు ఆకలితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో పేద ప్రజలకు బ్రతుకు పై భరోసా కల్పిస్తున్నారు నిర్విరామగాటి ఆర్ కె ట్రస్ట్ శనివారం 15వ రోజు కూడా వేములవాడ పట్టణ పరిసర ప్రాంతాల్లోని వలస జీవులకు, కూలీలకు, ఆలయ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి, అలాగే కరోనా బారిన పడి పలు ప్రైవేట్ ఆసుపత్రిలలో చికిత్స పొందుతున్న బాధితులకు టి ఆర్ కె ట్రస్ట్ సభ్యులు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టి.ఆర్.కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ మాట్లాడుతూ లాక్ డౌన్ తో నిరుపేదలు తినడానికి బందులు పడుతున్నారని విషయం తెలుసుకున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ గారు లాక్‌డౌన్ ముగిసేంత వరకు అన్నదానం చేయాలనే గొప్ప ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.

లాక్ డౌన్ ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు టి ఆర్ కె ట్రస్ట్ తరపున నిరుపేదలకు సహాయం అందించడానికి తాము ముందుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టి ఆర్ కె వర్కింగ్ టీం, ఎంక్వయిరీ టీం సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం నుండి 15 కిలోమీటర్లు లోపున ఉన్న మిల్లులకు ట్రాక్టర్ ల ద్వారా తరలించాలి

-నెలరోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు

**-ధాన్యం కొనుగోలు లను త్వ

పెద్దపల్లి జిల్లాలో ఆక్సిజన్ రైలులో మంటలు

హైదరాబాద్ , మే 29: హైదరాబాద్ నుంచి రాయ్‌చూర్ వెళ్తున్న ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయి. పెద్దపల్లి మండలం చీకురాయి వద్ద శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపశాఖ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు అంటుకున్న ట్యాంకర్ నుంచి మిగతా వాటిని విడదీసి, దూరంగా తరలించారు. అనంతరం మంటలను ఆర్పివేశారు. మంటలు చెలరేగిన ట్యాంకర్‌పై విద్యుత్ లైన్ ఉండగా.. ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. బ్రేక్ వేసిన సమయంలో మంటలు చెలరేగి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇప్పటిదాకా 22.77 కోట్లకు పైగా టీకా డోసులు

న్యూఢిల్లీ, మే 29: కోవిడ్ మీద పోరులో భాగంగా భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సోకినవారీ ఆచూకీ కనిపెట్టటం, తగిన చికిత్స అందించటం, వ్యాప్తి నివారణకు తగిన జాగ్రత్తలు పాటింపజేయటం, టీకాలివ్వటం అనే ఐదు అంశాల ప్రాధాన్యంలో భాగంగా టీకాల మీద ప్రత్యేక దృష్టిసారించింది. భారత ప్రభుత్వం దేశవ్యాప్త టీకాల కార్యక్రమానికి అండగా ఉండి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు టీకా డోసులు ఉచితంగా అందిస్తూ వచ్చింది. అంతే కాకుండా ఉత్పత్తి, సరఫరాను పెంచటానికి అనేక చర్యలు తీసుకుంటోంది.

మూడో దశ టీకాల కార్యక్రమాన్ని మరింత సరళంగా, వేగంగా అమలు చేయటం మే 1న మొదలైంది. ఈ వ్యూహంలో భాగంగా ప్రతి నెలలో సెంట్రల్ డ్రగ్స్ లేబరేటరీ (సిడిఎల్) ఆమోదించిన ఉత్పత్తి సంస్థలలో తయారైన 50% టీకా మందును కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రాష్ట్రాలు మిగిలిన 50% నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. ప్రభుత్వం అందించే టీకామందు మునుపటిలాగానే రాష్ట్రాలకు ఉచితంగా పంపిణీ జరుగుతుంది.

భారత ప్రభుత్వం ఇప్పటిదాకా రాష్ట్రాలకు, కేంద్రపాలితప్రాంతాలకు 22.77 కోట్లకు పైగా (22,77,62,450) కోవిడ్ డోసులు ఉచితంగా అందజేసింది. ఇందులో రాష్ట్రాల వాడకం, వృధా కలిపి ఈ ఉదయం 8 గంటలవరకు అందిన సమాచారాన్ని బట్టి 20,80,09,397 డోసులు ఉన్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల దగ్గర ఇంకా 1.82 కోట్లకు పైగా (1,82,21,403) టీకా డోసులు పంపిణీకి అందుబాటులో ఉన్నాయి. పైగా, మరో 4 లక్షలకు పైగా (4,86,180) టీకా డోసులు వచ్చే 3 రోజుల్లో కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపబోతోంది

ఏపీలో మరోసారి కర్ఫ్యూ పొడిగింపు ..

అమరావతి, మే 29: ఏపీలో కర్ఫ్యూను మరోసారి పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రంలో కరోనా ఉద్ధతి నేపథ్యంలో ఇంకొన్ని రోజులు కర్ఫ్యూ కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం కోవిడ్ పై సీఎం జగన్ సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కర్ఫ్యూ కొనసాగింపు పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కోవిడ్ తీవ్రంగా ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. తూర్పుగోదావరి, చిత్తూరులో అధికంగా కరోనా కేసులు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్ఫ్యూను కఠినంగా అమలు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుదని తెలుస్తోంది.

రాష్ట్రంలో కేసులు తగ్గాలంటే 4 వారాలు కర్ఫ్యూ ఉండాలని ఇటీవలే సీఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో కర్ఫ్యూ పెట్టి 10 రోజులే అయ్యిందని.. పరిస్థితి అదుపులోకి రావాలంటే మరికొంత సమయం పడుతుందన్నారు. గ్రామాల్లో కరోనా వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాలంటీర్లు, ఆశా వర్కర్లు, సచివాలయాలను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు.

గడిచిన వారం రోజులుగా 15 వేల పై చిలుకు కేసులు నమోదు అవుతునున్నాయి. అదే సమయంలో ప్రతి రోజ వందకు తగ్గకుండా మరణాలు సంభవిస్తున్నాయి. రాష్ట్రాల్లో జూన్ 30 వరకు లాక్ డౌన్ విధించాలని కేంద్రం కూడా సూచించింది. అయితే, లాక్ డౌన్ విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఏపీలో కర్ఫ్యూను మరి కొన్ని రోజులు పొడింగిచే ఛాన్స్ ఉంది.

అంధ్రప్రదేశ్ లో కరోనా విజృంభణ నేపథ్యంలో ఏపీలో ప్రభుత్వం కర్ఫ్యూను విధిస్తున్న విషయం తెలిసిందే. నిత్యం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కార్యకలాపాలకు అనుమతిస్తున్నారు అధికారులు. మధ్యాహ్నం 12 గంటల అనంతరం పూర్తి స్థాయిలో కర్ఫ్యూను అమలు చేస్తున్నారు. ఆ సమయంలో ప్రజలెవరూ రోడ్లపైకి రాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఆ సమయంలో ఎక్కడా ఐదుగురికి మించి గుమిగూడి ఉండటానికి వీల్లేదు. వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, కార్యాలయాలు, విద్యా సంస్థలు, రెస్టారెంట్లు వంటి వాటిని మూసివేయాలి. అత్యవసర సేవలకు మాత్రమే అనుమతి ఇస్తున్న సంగతి తెలిసిందే.

కరోనాతో తల్లి మృతి.. చెరువులో దూకి కుమారుడు ఆత్మహత్య

హైదరాబాద్ , మే 29: కరోనాతో తల్లి మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు లోనై కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుబాన్ కాలనీలో శనివారం ఈ విషాద ఘటన జరిగింది. చెరువులోకి దూకి బలవన్మరణానికి పాల్పడే ముందు యువకుడు శ్రీహరి (22) సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఇందులో తన కుటుంబ పరిస్థితిని వివరిస్తూ తన ఆవేదనను వెలిబుచ్చాడు.

కరోనా బారినపడిన తన తల్లి రుక్మిణి(60) చికిత్స పొందుతూ గచ్చిబౌలిలోని ప్రైవేట్ దవాఖానలో మృతి చెందిందని సెల్ఫీ వీడియోలో శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశాడు. రూ. 10 లక్షలు చెల్లిస్తేనే మృతదేహం ఇస్తామని ఆస్పత్రి యాజమన్యం చెప్పింది. తన తండ్రి కూడా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని వీడియోలో వాపోయాడు. కాగా ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహం కోసం చెరువులో గాలింపు చేపట్టారు.

మాస్కులు ధరించని 177 మందిపై కేసులు నమోదు

ఆదిలాబాద్,మే 29: : ఫేస్ మాస్కులు ధరించని 177 మందిపై, అదేవిధంగా కొవిడ్ మార్గదర్శకాలను పాటించని 52 మందిపై, అనవసరంగా రోడ్లపైకి వచ్చిన 590 మంది వ్యక్తులపై పోలీసులు కేసులు నవోదు చేశారు. ఈ ఘటన ఆదిలాబాద్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. లాక్‌డౌన్ నిబంధనలను అమలు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. పట్టణంలోని ముఖ్యమైన జంక్షన్లలో తనిఖీలు నిర్వహించి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. అనవరంగా రోడ్లపైకి వచ్చేవారిని ఐసోలేషన్ కేంద్రాలకు తరలిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ హర్షవర్ధన్ శ్రీవత్సవ్, అదనపు ఎస్పీలు శ్రీనివాస్ రావు, వినోద్ కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్ రావు, ఉమమహేశ్వర్ రావు, పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఏపీలో నలుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ

ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం జిల్లా కలెక్టర్ పీ భాస్కర్‌ను కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, సాంకేతిక విద్య డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే ఏపీ టూరిజం ఎండీ ప్రవీణ్‌కుమార్‌ను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది.

పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఐఏఎస్ అధికారి ఎస్ సత్యనారాయణను ఏపీ టూరిజం ఎండీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

అలాగే పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పీ బసంత్‌కుమార్‌ను మున్సిపల్ శాఖలో ఎంఐజీ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, ఏపీయూఎఫ్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

నిర్మల్‌లో 30 వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

నిర్మల్, మే 29: లాక్ డౌన్ నిబంధనలు ఉల్లంఘించి, అకారణంగా రోడ్లపై తిరుగుతున్న వారిపై నిర్మల్ జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు.

శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో అకారణంగా తిరుగుతున్న 96 మందిని పట్టుకొని కొవిడ్ నిర్ధారణ పరీక్ష కేంద్రానికి ప్రత్యేక వాహనంలో తరలించారు.

వీరికి కరోనా పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్మల్ జిల్లా ఇన్ చార్జి ఎస్పీ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కుటుంబ సభ్యులను పిలిపించి వారి ముందే కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

30 వాహనాలను సీజ్ చేశారు. వీటిని లాక్ డౌన్ తర్వాత అప్పగిస్తామని తెలిపారు.

ఈ తనిఖీల్లో డీఎస్పీ ఉపేందర్ రెడ్డి, సోన్ సీఐ జీవన్ రెడ్డి, జిల్లా వైద్య అధికారి ధన్ రాజ్ తదితరులున్నారు.

నిరుపేద మహిళకు మంత్రి కొప్పుల ఆపన్నహస్తం

ధర్మారం, మే 29: : సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తన గొప్ప మనసును చాటుకున్నారు. కరోనా బారినపడ్డ ఓ తల్లిని నవ మాసాలు మోసి, కనిపెంచిన పిల్లలే పట్టించుకోలేని పరిస్థితుల్లో.. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకొని చలించిపోయారు. వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేయించి, కరీంనగర్ దవాఖానలో చేర్పించి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని ఆదేశించారు. ధర్మారం దొంగతుర్తి గుండ గంగమ్మ పది రోజుల కిందట కరోనా మహమ్మారి బారినపడింది. అప్పటి నుంచి దిక్కుతోచని పరిస్థితుల్లో ఒక్కతే ఇంట్లో బిక్కుబిక్కుమంటూ ఉంటోంది. స్థానిక ఫొటోగ్రాఫర్ ఒకరు నిత్యం భోజనం అందిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించింది.

గంగమ్మకు నలుగురు బిడ్డలు ఉన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వారికి సమాచారం అందించగా.. ఎవరూ ముందుకు రాలేదు. చుట్టుపక్కల ఉన్న వారు సైతం పట్టించుకోలేదు. ఆమె పరిస్థితిని వివరిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పట్టారు. ఇది గమనించిన మంత్రి కొప్పుల ఈశ్వర్ వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేయించి, గంగమ్మను కరీంనగర్ దవాఖానకు తరలించారు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన వైద్యులతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా విషయాన్ని తెలుసుకొని మహిళకు వైద్యసేవలందేలా చర్యలు తీసుకున్న మంత్రి ఈశ్వర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రిలో ఘోరం.. గిరాకీ లేదని అంబులెన్స్ డ్రైవర్ల కిరాతకం..

హైదరాబాద్ , మే 29: కరోనా మహమ్మారితో ప్రజలు అల్లాడుతుంటే శవాల మీద చిల్లర ఏరుకునే దుర్మార్గులు బయల్దేరారు. తమకు గిరాకీ లేదని ఏకంగా ఐసీయూలోని కరోనా రోగులను చంపేందుకు కూడా వెనకాడలేదు కిరాతకులు. కరోనా రోగులకు సీరియస్ అయినా.. చనిపోయినా తమకు కిరాయి వస్తుందని అంబులెన్స్ డ్రైవర్లు అత్యంత కిరాతక చర్యకు పూనుకున్నారు. ఆక్సిజన్ సప్లై ఆపేసి రోగుల ప్రాణాలతో చెలగాటమాడారు. ఆస్పత్రి వార్డుబాయ్ ఆ దారుణాన్ని చూడడంతో రోగుల ప్రాణాలు నిలిచాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ ఘోరం జరిగింది.

తమకు కొద్దిరోజులుగా పేషంట్లు దొరకడం లేదని.. గిరాకీ పెంచుకునేందుకు ముగ్గురు అంబులెన్స్ డ్రైవర్లు దారుణానికి ఒడిగట్టారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న కరోనా రోగులకు ఆక్సిజన్ సరఫరాని ఆపేశారు. ఆక్సిజన్ సప్లై ఆగిపోవడాన్ని గమనించిన వార్డు బాయ్ వెంటనే అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది. ఆక్సిజన్ సప్లై ఆపేసిన ఓ ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌ను గుర్తించి ఆస్పత్రి సిబ్బంది పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిరోజులుగా అంబులెన్సులకు గిరాకీ లేదని.. ఎవరికైనా సీరియస్ అయినా, లేకుంటే చనిపోతే తమకు గిరాకీ వస్తుందని భావించి ఈ పని చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను ఆస్పత్రి అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆక్సిజన్ సప్లై ఆపేసిన ఓ ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌ను గుర్తించి ఆస్పత్రి సిబ్బంది పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు.

సూపర్ స్ప్రెడర్లుకు టీకా సక్సెస్

ఖమ్మం , మే 29: తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొవిడ్ నియంత్రణ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. మంత్రి అజయ్‌కుమార్ దిశానిర్దేశంలో ఖమ్మం కలెక్టర్ కర్ణన్ స్వీయ పర్యవేక్షణలో మహమ్మారిని అంతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా కరోనా వ్యాప్తి కారకులు (సూపర్ స్ప్రెడర్లు)గా గుర్తించిన వివిధ రంగాల వారికి శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాక్సినేషన్ ప్రక్రియ సూపర్ సక్సెస్ అయింది. ఖమ్మం జిల్లాలోని నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, మరో 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో టీకా కోసం ఉదయం 8 గంటల నుంచే జనం బారులు తీరారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 18-44 ఏళ్ల వయసు కలిగిన ఎల్‌పీజీ డీలర్లు, వర్కర్లు, పెట్రోల్ బంకుల ఓనర్లు, వర్కర్లు 819, ఎఫ్‌సీఐ సిబ్బంది 215, జర్నలిస్టులు 472, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్లు 620, ఇతరులు 10 కలిపి మొత్తం 2,387 మందికి విజయవంతంగా టీకాలు వేశారు. అదేవిధంగా 45-60 ఏళ్ల మధ్య ఉన్న రేషన్ డీలర్లు 56, ఎల్‌పీజీ డీలర్లు, వర్కర్లు, పెట్రోల్ బంకుల వర్కర్లు 420, ఎఫ్‌సీఐ సిబ్బంది 116, జర్నలిస్టులు 209, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్లు 268, ఇతరులు 18 కలిపి మొత్తం 1,084 మందికి వ్యాక్సినేషన్ చేశారు. రెండు కేటగిరీలూ కలిపి 3,471 మందికి టీకా అందించారు.

పంచాయతీ శాఖ విస్తృత ఏర్పాట్లు..

కొవిడ్ వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా ప్రజలతో నేరుగా సంబంధాలు ఉంటాయో వారిని గుర్తించి టీకాలు వేసే వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికిగాను జిల్లా వైద్యారోగ్యశాఖతోపాటు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలను రంగంలోకి దింపింది. దీంతో ఖమ్మం జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం జిల్లాలో 7,500 మంది సూపర్ స్ప్రెడర్లకు ఈ నెల 28, 29 తేదీల్లో వ్యాక్సినేషన్ కోసం 24 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఖమ్మం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశలో గుర్తించిన రేషన్ డీలర్లు, వర్కర్లు, ఎల్‌పీజీ డీలర్లు, వర్కర్లు, పెట్రోల్ బంక్ వర్కర్లు, జర్నలిస్టులు, ఫెర్టిలైజర్స్ డీలర్లకు కొవిడ్ వ్యాక్సిన్ ఇచ్చేందుకు నగరంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. లాక్‌డౌన్ వల్ల జిల్లాలో పాజిటివ్ రేటు తగ్గుముఖం పట్టిందని అన్నారు. కేఎంసీ కమిషనర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

భద్రాద్రిలో 387 మందికి సెకండ్ డోస్

భద్రాద్రి జిల్లాలో 2,062 మందికి తొలి రోజు టీకాలు వేశారు. ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా గుర్తించిన విలేకరులు కూడా వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఇందులో భాగంగా రెండో డోసులో 387 మంది టీకా పొందారు. ఇక ఇప్పటికే రెండు రౌండ్లు పూర్తయిన ఇంటింటి సర్వే మూడో రౌండ్ కూడా కొనసాగుతుంది. గ్రామ పంచాయతీల్లో 700 బృందాలు 1,36,516 ఇళ్లకు వెళ్లి 3,481 కిట్లను అందజేశాయి. మున్సిపాలిటీల పరిధిలో 156 బృందాలు 25,569 ఇళ్లకు వెళ్లి 635 కిట్లను అందజేశాయి. దీంతోపాటు ఆసుపత్రుల్లో 44 కేంద్రాల్లో 23,528 కిట్లను అందించాయి. జిల్లాలో 4,310 యాక్టివ్ కేసులు ఉండగా వీరిలో 4,005 మంది కోలుకున్నారు. కొత్తగూడెం ఆసుపత్రిలో 150 మంది, భద్రాచలంలో 114 మంది, మణుగూరులో 23 మంది, ఇల్లెందులో 10 మంది, అశ్వారావుపేటలో 8 మంది చికిత్స పొందుతున్నారు.

నడిరోడ్డుపై డాక్టర్ దంపతుల దారుణహత్య

హైదరాబాద్ , మే 29: రాజస్థాన్‌లోని జైపూర్‌లో పట్టపగలే డాక్టర్ దంపతులను హత్య చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. భరత్‌పూర్ జిల్లా హెడ్ క్వార్టర్స్ లోని సెంట్రల్ బస్టాండ్ సర్కిల్ వద్ద బైకుపై వచ్చిన ఇద్దరు నిందితులు ఓ కారును అడ్డగించారు. ఆ కారులోని దంపతులపై ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో కారులోని జంట అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు డాక్టర్లు అని.. వారిని సుదీప్ గుప్తా, సీమా గుప్తాలుగా పోలీసులు గుర్తించారు.

అయితే ఈ హత్యలను ప్రతీకార హత్యలుగా రాజస్థాన్ పోలీసులు భావిస్తున్నారు. బైక్‌పై వచ్చిన నిందితులు అనూజ్, మహేష్ అని వారి విచారణలో తేలింది. వారి వివరాల ప్రకారం.. డాక్టర్ సుదీప్‌కు గతంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. కొన్నేళ్లు గడిచిన తర్వాత ఆ మహిళ, ఆమె ఐదేళ్ల బిడ్డ ఉన్న ఇంటికి నిప్పంటుకుని ప్రమాదవశాత్తూ వారు చనిపోయారు. అయితే అది ప్రమాదం కాదని, సుదీప్ కుటుంబమే ఆ దాష్టీకానికి పాల్పడిందని కేసు నమోదైంది. దీంతో 2019లో సుదీప్, అతడి తల్లి, భార్య సీమా జైలు శిక్ష అనుభవించి ఇటీవలే విడుదలయ్యారు. ఈ కేసులో బాధితురాలి సోదరుడే ఇప్పుడు నిందితుల్లో ఒకడైన అనుజ్ అని పోలీసులు తెలిపారు. దీంతో ప్రతీకారంగానే అనూజ్ మరో వ్యక్తితో కలిసి హత్యలకు పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కాగా ఈ హత్యలకు సంబంధించిన వీడియోను బీజేపీ నేత రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేసి.. కాంగ్రెస్ పాలనలో నేరగాళ్లు విజృంభిస్తున్నారని ఆక్షేపించారు.

మహిళలకు గుడ్ న్యూస్..తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్ , మే 29: దేశంలో బంగారానికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.బంగారానికి ఉన్న డిమాండ్ మరింకా దేనికి లేదు. గత కొన్నిరోజుల స్థిరంగా ఉన్న బంగారం ధరలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 200 తగ్గి రూ. 45,700 కి చేరింది.

అలాగే 24 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ. 240 తగ్గి రూ. 49,860కి చేరింది. అటు వెండి ధరలు మాత్రం కాస్త పెరిగాయి. కిలో వెండి ధర రూ.400 పెరిగి రూ. 76,100 కు చేరింది

'చేయూత' కోసం మహిళల అవస్థలు.. ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు

అమరావతి, మే 29: ఆధార్ అన్నింటికీ ఆధారం. పిల్లలకు అమ్మఒడి పథకం డబ్బులు రావాలన్న, పెద్దలకు ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా.. ఆధార్ వివరాలు అడుగుతున్నారు. ఇందులో ఏ చిన్న మార్పు చేయాలన్నా రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. కరోనా వేళ నిన్న మొన్నటి వరకు వ్యాక్సిన్ కోసం బారులు తీరిన మహిళలు ఇప్పుడు ఆధార్‌లో తప్పులు సరిదిద్దుకోవడానికే ఆ క్యూ లైన్లు కట్టారు. ఎక్కడ వెనుకబడిపోతామో అని నిద్రాహారాలు మానేసి క్యూ కడుతున్నారు.

ఏపీలో సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఆధార్‌ను తప్పనిసరి చేసింది. బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉంటేనే నగదు జమ అవుతోంది. అదేసమయంలో ఫోన్ నెంబర్‌ను కూడా ప్రమాణికంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చేయూత పథకం కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పథకం కింద బీసీ వర్గానికి చెందిన మహిళలకు రూ.15వేల బ్యాంకులో జమ చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ దరఖాస్తుతో పాటు ఆధార్ ని కూడా జతచేయాలన్న నిబంధన విధించింది. దీంతో మహిళలు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో పలు జిల్లాల్లో ఆధార్ కేంద్రాల వద్ద భారీగా రద్దీ నెలకొంది.

కృష్ణాజిల్లా నందిగామ కంచికచర్ల ఆధార్ సెంటర్లకు మహిళలు పోటెత్తారు. చేయూత పథకం కోసం ఆధార్ సెంటర్ కు మహిళు బారులు తీరారు. పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆధార్ నిర్వహకులు బెంబేలెత్తిపోతున్నారు. చేయూత పథకం కోసం ప్రభుత్వం ఆధార్ కు ఫోన్ నెంబర్ లింక్ తప్పనిసరి చేయడంతో.. పథకం లబ్ధి పొందేందుకు మహిళలు వందల సంఖ్యలో ఆధార్ సెంటర్ కు వస్తున్నారు. రద్దీ ఎక్కువ కావడంతో ఆధార్ సెంటర్ నిర్వహకులు చేతులెత్తేశారు. అయితే, స్థానిక పోలీసుల సహాయంతో మూడు రోజులుగా ఆధార్ సెంటర్ నిర్వహణ సాగుతోంది. సర్వర్ సరిగా పనిచేయడం లేదని కరోనా నేపథ్యంలో మూసి వేస్తున్నామని నందిగామ ఆధార్ సెంటర్ నిర్వాహకులు బోర్డు తగిలించారు. అర్ధరాత్రి నుండి ఆధార్ సెంటర్ వద్ద పడిగాపులు కాసిన మహిళలు నిరాశగా వెనుదిరిగారు.

గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల్లో ఆధార్ కేంద్రాల వద్ద రద్ది నెలకొంది. చిన్న చిన్న మార్పుల కోసం క్యూ కట్టాల్సి వస్తోంది. తప్పులు సరిదిద్దుకోకుంటే ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది.. నిద్రాహారాలు మానేసి.. ఇంటి వద్ద పనులన్నీ అపేసి ఇలా వరుసల్లో వచ్చి నిల్చుంటున్నారు మహిళలు.

వైసీపీ ఎమ్మెల్యేపై 10 కేసులను ఎత్తివేసిన జగన్ సర్కారు

అమరావతి, మే 29: ప్రభుత్వ విప్, కృష్ణా జిల్లా జగ్గయ్యపేట వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుపై ఉన్న 10 కేసులను జగన్ ప్రభుత్వం ఎత్తివేసింది. ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల విచారణ కోసం విజయవాడలో రాష్ట్ర స్థాయి ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటైంది. అందులో ఈ 10 కేసుల విచారణ ప్రస్తుతం వివిధ దశల్లో ఉండగా.. వాటన్నింటినీ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ ఏడాది మార్చి 23న డీజీపీ సవాంగ్ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు హోంశాఖ కేసుల ఎత్తివేత ఉత్తర్వులను జారీ చేసింది. ఇందుకు వీలుగా ఆయా న్యాయస్థానాల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో పిటిషన్లు దాఖలు చేయించాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది.

కాగా సీఎన్‌పీఏ ఆర్గనైజేషన్ పేరిట సర్వే నిర్వహిస్తున్న కొందరు సిబ్బందిని ఉదయభాను అక్రమంగా నిర్బంధించారని, వారిని కిడ్నాప్ చేసి నేరపూరితంగా బెదిరించారన్న ఫిర్యాదులపై జగ్గయ్యపేట పీఎస్‌లో కేసు నమోదైంది. మరోవైపు జగ్గయ్యపేట ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆక్రమణలు తొలగిస్తున్నప్పుడు ఆర్‌అండ్‌బీ ఏఈఈ విధులకు ఆటంకం కలిగించడం, నేరపూరిత బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. వీటిని తాజా ప్రభుత్వం ఎత్తివేసింది.

22కు చేరిన అలీగఢ్ కల్తీ మద్యం మృతులు..!

లక్నోమే 29: : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలీగఢ్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి మరణించిన వారి సంఖ్య 22కు చేరింది. శుక్రవారం సాయంత్రానికి 15 మంది మృతిచెందగా.. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నానికి మరో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దాంతో మొత్తం మృతుల సంఖ్య 22కు చేరింది. మరో 28 మంది పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు.

అలీగఢ్‌లోని లోధా, ఖైర్, జవాన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని వివిధ గ్రామాల్లో కల్తీ మద్యం సేవించి 15 మంది ప్రాణాలు కోల్పోయారని శుక్రవారం ఆ జిల్లా అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత మృతుల సంఖ్య 22కు చేరింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారిలోనూ కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృ

ఉత్తమ జీవన ప్రమాణాలతో గోవా ముందడుగు

(30 మే 'గోవా రాష్ట్ర అవతరణ దినం' సందర్భంగా)

భారతదేశ నైరుతి తీరప్రాంత గోవా రాష్ట్ర దక్కన్ పీఠ భూమిగా పశ్చిమ కనుమలతో వేరు చేయబడి ఉంది. పనాజీ కేంద్రంగా కోంకన్ అధికారిక భాష మాట్లాడే గోవా ప్రాంతం ప్రకృతి రమణీయతలకు పెట్టింది పేరుగా ప్రసిద్ధి గాంచింది. ఉత్తరాన మహారాష్ట్ర, పశ్చిమ మరియు దక్షిణాన కర్నాటక, పశ్చిమాన కొంత సముద్ర తీరప్రాంతంగా పర్యాటకులకు స్వర్గతుల్యంగా నిలుస్తున్నది. 15 ఆగష్టు 1947న స్వాతంత్ర్యం పొందినప్పటికీ పోర్చుగీస్ పాలనలోనే ఉండి పోయింది. 450 ఏండ్ల పోర్చుగీస్ పాలన అనంతరం 19 డిసెంబర్ 1961న భారత ప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ విజయ్' త్రివిధ దళాల దాడితో 36 గంటల్లోనే డమన్, డయ్యూ ద్వీపాలతో పాటు గోవా కూడా విముక్తమై భారత్‌లో అంతర్భాగం అయ్యాయి. 30 మే 1987న భారత ప్రభుత్వం గోవాకు (25వ రాష్ట్రంగా) రాష్ట్ర హోదాను ఇవ్వడంతో డయ్యూ మరియు డమన్‌లను కేంద్ర పాలిత ప్రాంతాలుగానే మిగిలి పోవలసి వచ్చింది. వైశాల్యంలో అతి చిన్న రాష్ట్రంగా మరియు జనాభాలో నాలుగవ చిన్న రాష్ట్రంగా అరేబియా సముద్ర ఒడ్డున ఉన్నది. దేశంలోన అత్యధిక 'పర్ కాపిటా జిడిపి' (దేశంలో 2.5 రెట్లు అధికంగా) కలిగిన రాష్ట్రంగా గోవా ఉన్నత స్థితిలో ఉంది. ఉన్నత జీవన ప్రమాణాలతో అధిక మౌళిక వసతులు కలిగిన గోవాలో 65 మైళ్ల తీరప్రాంతంతో పాటు అందమైన బీచ్‌లు, విదేశీ పర్యాటకులకు ప్రసిద్ధిగాంచింది.

కోంకన్ ప్రాంతంగా పిలువబడే గోవా రాష్ట్రం 30 మే 1987 నుంచి 'రాష్ట్ర అవతరణ దినోత్సవాలను' ఘనంగా నిర్వహించు జరుగుతున్నది. గోవా ప్రాంతంలో జువారీ, మండోవి,తెరెకోల్, చపోర, గల్జిబాగ్, కుంబర్జువా కెనాల్, తల్పోన మరియు సాల్ అనబడే ఏడు నదులు ప్రవహిస్తాయి. అతి పెద్ద పట్టణంగా వాస్కోడగామ కలిగిన గోవాలో రెండు జిల్లాలు ఉన్నాయి. గోవా రాష్ట్ర జనాభా 15.22 లక్షలు ఉంటుంది. హిందువులు మరియు క్రిస్టియన్లు అధికంగా ఉన్న గోవాలో ముస్లిమ్‌లు, సిక్కులప, జైనులు కూడా కొద్ది జనాభా ఉంది. కోంకణి, మరాఠీ మరియు ఆంగ్‌ఒల భాష అధికంగా మాట్లాడే గోవాలో వ్యవసాయం ప్రధాన జీవనోపాధిగా నడుస్తున్నది. ఖనిజ సంపద అధికంగా ఉన్న గోవాలో పారిశ్రామిక ప్రగతి కూడా చెప్పుకోదగినది. కొబ్బరి తోటల నీడన బీచ్‌లు, స్వర్ణమయ ఇసుక తిన్నెలు, ఆకు పచ్చ పరిసరాలు, వైవిధ్య భరిత సాంస్కృతిక వారసత్వ విలక్షణతలు, అద్భుత పురాతన చర్చిలు, దేవాలయాలు, కోటలు, పోర్చిగీస్ కళానైపుణ్య స్మారక కట్టడాలు మరియు ఊరు-పడమటల సాంస్కృతిక మేలుకలయికలతో గోవా ప్రముఖ రాష్ట్రంగా, 'వరల్డ్ హెరిటేజ్ సైట్'గా కూడా గుర్తించబడి దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నది. 'పర్యాటకుల సర్గం'గా కొనియాడబడే గోవా ప్రత్యేకతల్ని ఆస్వాదిస్తూ, ఆధునికత పేరున సాంస్కృతిక విధ్వంసం మరియు వారసత్వ సంపదకు విఘాతం కలుగకుండ చూసుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నది.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కరోనాతో పనికి వెళ్లలేక పస్తులు.. ఆపన్నహస్తం అందించిన హరీశ్ రావు

సిద్దిపేట, మే 29: : కరోనా బారినపడి పనికి వెళ్లలేక పస్తులుంటున్న తల్లీకుమారుడికి మంత్రి హరీశ్ రావు ఆపన్నహస్తం అందించారు. తన ప్రతినిధులను వారి వద్దకు పంపి కావాల్సినవి సమకూర్చారు. కష్టకాలంలో తానున్నానంటూ మనోధైర్యాన్ని నింపి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎడమ ఎల్లవ్వ, ఆమె కుమారుడు పరుశురాం ఇటీవల కరోనా బారిపడ్డారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి వారిది. కరోనా కారణంగా పనికి వెళ్లలేకపోవడంతో చేతిలో పైసలు లేకుండాపోయాయి. ఇంట్లో బియ్యం, ఇతర సామగ్రి అయిపోవడంతో పస్తులే దిక్కయ్యాయి.

వీరి దీనావస్థపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో నెటిజన్లు ఆ విషయాన్ని ట్విట్టర్ ద్వారా మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన తన తరుఫున ఓ ప్రతినిధి బృందాన్ని వారింటికి పంపి కావాల్సిన వస్తువులను సమకూర్చారు. కొంతకాలం దేనికి ఇబ్బంది లేకుండా నగదును సైతం అందజేశారు. విషయం తెలిసిన గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాన్ని ఆదుకున్నట్లు మంత్రి హరీశ్ రీట్వీట్ చేయడంతో నెటిజన్లు ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

కరోనాతో పనికి వెళ్లలేక పస్తులు.. ఆపన్నహస్తం అందించిన హరీశ్ రావు

సిద్దిపేట, మే 29: : కరోనా బారినపడి పనికి వెళ్లలేక పస్తులుంటున్న తల్లీకుమారుడికి మంత్రి హరీశ్ రావు ఆపన్నహస్తం అందించారు. తన ప్రతినిధులను వారి వద్దకు పంపి కావాల్సినవి సమకూర్చారు. కష్టకాలంలో తానున్నానంటూ మనోధైర్యాన్ని నింపి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎడమ ఎల్లవ్వ, ఆమె కుమారుడు పరుశురాం ఇటీవల కరోనా బారిపడ్డారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి వారిది. కరోనా కారణంగా పనికి వెళ్లలేకపోవడంతో చేతిలో పైసలు లేకుండాపోయాయి. ఇంట్లో బియ్యం, ఇతర సామగ్రి అయిపోవడంతో పస్తులే దిక్కయ్యాయి.

డిసెంబర్ నాటికి రాష్ట్ర ప్రజలందరికి కరోనా టీకాలు

వరంగల్, మే 29: : డిసెంబర్ చివరి నాటికి రాష్ట్ర ప్రజలందరికీకి కరోనా టీకాలు వేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. శనివారం ఆయన హంటర్ రోడ్, విష్ణుప్రియ గార్డెన్స్ లో సూపర్ స్పైడర్స్ కోసం ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సూపర్ స్పైడర్స్ కు ముందుగా టీకాలు ఇవ్వాలన్న సీఎం ఆలోచన బ్రహ్మాండమైందన్నారు. కరోనా కట్టడికి సీఎం కేసీఆర్ తీసుకొంటున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు.

సీఎం ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కరోనా టీకాలు అందరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డిసెంబర్ కల్లా రాష్ట్ర ప్రజలందరికి టీకాలు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం 20 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అర్హులందరు తప్పకుండా టీకాలు వేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, నగర మేయర్ గుండు సుధారాణి, రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాష్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల సత్పతితో, డీఎంహెచ్‌వో లలితా దేవి, తదితరులు పాల్గొన్నారు.

లాక్‌డౌన్ నియంత్రణలకు మరిన్ని సడలింపులు : కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 29: కరోనా సెకండ్ వేవ్ వ్యాప్తితో తల్లడిల్లిన దేశ రాజధాని ఢిల్లీ క్రమంగా తేరుకుంటోంది. కొవిడ్-19 కేసుల సంఖ్య తగ్గుముఖం పడుతున్న క్రమంలో తాజాగా సెకండ్ వేవ్ మొదలైన తర్వాత తొలిసారిగా శనివారం పాజిటివ్ కేసుల సంఖ్య 1000 దిగువకు పడిపోయింది. కేసుల సంఖ్య తగ్గుతుండటంతో లాక్ డౌన్ నియంత్రణలకు మరిన్ని సడలింపులు ఇస్తామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు.

కరోనా తాజా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని మరిన్ని కార్యకలాపాలకు రానున్న రోజుల్లో అనుమతిస్తామని కేజ్రీవాల్ తెలిపారు. సెకండ్ వేవ్ వ్యాప్తితో లాక్ డౌన్ ప్రకటించిన రోజున ఢిల్లీలో రోజువారి కరోనా పాజిటివిటీ రేటు 27 శాతం ఉండగా ఇప్పుడది 2 శాతం లోపు పడిపోవడం ఊరట కలిగిస్తోంది.

వీరి దీనావస్థపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో నెటిజన్లు ఆ విషయాన్ని ట్విట్టర్ ద్వారా మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన తన తరుఫున ఓ ప్రతినిధి బృందాన్ని వారింటికి పంపి కావాల్సిన వస్తువులను సమకూర్చారు. కొంతకాలం దేనికి ఇబ్బంది లేకుండా నగదును సైతం అందజేశారు. విషయం తెలిసిన గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాన్ని ఆదుకున్నట్లు మంత్రి హరీశ్ రీట్వీట్ చేయడంతో నెటిజన్లు ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

సమాజ సేవకు అంకితభావంతో పని చేయాలి

టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్

రాజన్న సిరిసిల్ల మే, 29(నేటినిజం ప్రతినిధి): కో విడ్ 19 సెకండ్ వేవ్ ఉధృతి నేపథ్యంలో మానవత్వమే మన అందరి అభిమతం గా భావిస్తూ అంకితభావంతో సమాజ సేవ చేయడం అందరి లక్ష్యమని వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ అన్నారు .శనివారం వేములవాడ పోలీస్ సిబ్బందికి ఎన్ 95 మాస్కులు, సర్జికల్ మాస్కులు, సానిటజర్లు మరియూ ఎనర్జీ డ్రింక్స్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ చేతులమీదుగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ గత 12 రోజుల నుండి పట్టణంలో మై వేములవాడ వాట్సాప్ గ్రూప్ ఛారిటబుల్ ట్రస్టు వారు పట్టణంల సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు .మై వేములవాడ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ క రోనా మహమ్మారి కట్టడి కోసం అహర్నిషలు రోడ్డుపైనే వీధులు చేపడుతున్న వారు చేస్తున్న సేవలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కుమ్మరి శంకర్, మదు మహేష్, తాటికొండ పవన్ కుమార్, గొంగళ్ల రవికుమార్, డాక్టర్ రవీందర్, రంగుల శ్రీనివాస్ మరియూ నాగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేసిన మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్,మే 29: : కరోనా మహమ్మారి లాంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి పారిశుద్ధ్య కార్మికులు, వైద్య సిబ్బంది, పోలీసులు అమోఘమైన సేవలు అందిస్తున్నారని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంత్రి సోదరుడు అల్లోల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన (సుమారు 500 మందికి) మధ్యాహ్న భోజన పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి నుంచి కాపాడటం కోసం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు,వైద్య సిబ్బంది, పోలీసులు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నిరంతరాయంగా పని చేస్తున్నారని అన్నారు.

రెండు, మూడు రోజుల్లో ఎఐఖీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెయ్యి మందికి 1000 రూపాయలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నామని మంత్రి తెలిపారు. అనంతరం ప్రధాన ఆసుపత్రి వద్ద వైద్య సిబ్బంది, రోగులకు ఆయన భోజనాన్ని అందజేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘు నందన్ రెడ్డి, ఎంపీపీ రామేశ్వర రెడ్డి, సురేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, టీఆర్ఎస్ యువజన నేత అల్లోల గౌతమ్ రెడ్డి, అల్లోల రాజ్ కిరణ్ రెడ్డి, నితీష్ రెడ్డి, రేవంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరోనాకు మరో కొత్త పరీక్ష.. సెలైన్ పుక్కిలిస్తే 3 గంటల్లో ఫలితం

హైదరాబాద్ , మే 29: సులభమైన కరోనా పరీక్ష అందుబాటులోకి వచ్చింది. సెలైన్ నోటిలో వేసుకుని పుక్కిలించి ఓ ట్యూబులో ఉమ్మాలి. ఆ ట్యూబును పరీక్షకు పంపితే చాలు.. మూడు గంటల్లో ఫలితం వస్తుంది. ఈ కొత్త పరీక్ష వల్ల సమయం, సాధన సంపత్తి ఆదా అవుతాయి. శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి (సీఎస్ఐఆర్) ఈ చవకైన, సులభమైన కొత్త పరీక్షను రూపొందించింది.

ఈ కిట్ లో ఉంటే సెలైన్‌ను గొంతులో పోసుకుని 15 సెకన్ల పాటు పుక్కిలించాలి. తర్వాత ఆ ద్రవాన్ని ట్యూబులోకి ఉమ్మాలి. ఆ ట్యూబును ప్రయోగశాలకు పంపితే ఫలితం వస్తుంది. కరోనా రక్షణ దుస్తులు, దూదిపుల్లలు ఇలాంటివేవీ ఈ పరీక్షలో అవసరం లేదు.

ఇదొక గమనించదగ్గ నూతన ఆవిష్కరణ అని కేంద్ర ఆరోగ్యమంత్రి డాక్టర్ హర్ష్ వర్ధన్ వ్యాఖ్యానించారు. దూదిపుల్ల అవసరం లేని, ఇబ్బంది కలిగించని ఈ విధానం కరోనా పరీక్షల తీరుతెన్నులనే మార్చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎవరికి వారే శాంపిల్స్ సేకరించి పంపవచ్చునని, జనాల మధ్య క్యూలో నిలబడి అవస్థలు పడాల్సిన అగత్యం లేదని వైద్య నిపుణులు అంటున్నారు. ఈ పద్ధతిలో వ్యర్థాలు కూడా తగ్గుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారత వైద్య పరిశోధన జర్నల్‌లో ఈ కొత్త పరీక్ష గురించి ఇటీవలే ఒక అధ్యయన నివేదికను ప్రచురించారు.

హమ్దర్ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం పంపిణీ

రాజన్న సిరిసిల్ల మే, 29(నేటినిజం ప్రతినిధి): హమ్దర్ఫౌండేషన్ నిర్వహకురాలు మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు రాఫియా సుల్తాన ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ఏరియాలో 200 మందికి భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాఫియా సుల్తాన మాట్లాడుతూ ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సూచనల మేరకు లాక్డౌన్ లో పేదలు, బాట సారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వారి ఆకలి తీర్చడానికి భోజనం పంపిణీ చేశామన్నారు.

పేదల, బాట సారులను గుర్తించి వారి ఆకలి తీర్చడం ఇస్లాం ఆదేశించిన గొప్ప సాంప్రదాయమని మహానియ మహమ్మద్ ప్రవక్త (సల్లం) చెప్పిన విధంగా ఈ భోజనం పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

ఈ సేవ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్న ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షాకిర్ నహ్దీ, షోయబుల్లాహ్ ఖాన్, అబ్దుల్లా ఖాన్ పాల్గొన్నారు.

చిత్తూరులో జూన్ 1 నుంచి 15 వరకు లాక్ డౌన్..

అమరావతి, మే 29: ఏపీలో కరోనా కేసులు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెల రోజులుగా కర్ఫ్యూ కఠినంగా అమలువుతున్నా కొన్ని జిల్లాల్లో కరోనా పాజిటివ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో కరోనా తీవ్రత అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇన్ ఛార్జ్ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి కొవిడ్ నియంత్రణపై జరిగిన సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లాల్లో జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు లాక్ డౌన్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం 6గంటల నుంచి 10 గంటల వరకే షాపులు తెరవాలని నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఆరు గంటల వరకు లాక్ డౌన్ అమలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రస్తుతం మధ్యాహ్నం 12 గంటల నుంచి కర్ఫ్యూ అమలవుతోంది.

ఏపీలో జూన్ 1 నుంచి 15 వరకు లాక్ డౌన్.. ఎక్కడంటే..

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్నందున చిత్తూరు జిల్లా కరోనాకు హాట్ స్పాట్ గా మారిందని మంత్రులు అభిప్రాయపడ్డారు. చిత్తూరు జిల్లాలో జూన్ 1వతేదీ నుంచి 6గంటల నుంచి 10గంటల వరకే షాపులకు అనుమతి ఇస్తామని మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల తరువాత కర్ఫ్యూ అమల్లో ఉంటుందన్నారు. ఆనందయ్య మందుపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. ఔషధ పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కోవిడ్ ను నియంత్రించేందుకు సీఎం జగన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. ఆగష్టు లోగా వ్యాక్సినేషన్ ప్రక్రియ ఎపిలో పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 1వతేదీ నుంచి 15వతేదీ వరకు లాక్ డౌన్ మరింత కఠినంగా అమలు చేస్తామని మంత్రి పెద్ది రెడ్డి స్పష్టం చేశారు.

నూతన లిఫ్టుల డీపీఆర్‌లు జూన్ 15 నాటికి సిద్ధం చేయాలి : మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్ , మే 29: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొత్తగా నిర్మించ తలపెట్టిన లిఫ్టుల డీపీఆర్‌లు జూన్ 15 నాటికి సిద్ధం చేయాలని మంత్రి జగదీశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టుల పురోగతిపై నగరంలోని జలసౌధలో మంత్రి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, ఈఎన్‌సీ మురళీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డీపీఆర్‌లు పూర్తి చేసి సత్వరమే నిర్మాణాలు చేపట్టాలన్నారు.

సూర్యాపేట జిల్లా ఎస్సారెస్పీ కాలువల ఆధునీకరణతో పాటు అయిటిపాముల లిఫ్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు పనుల వేగాన్ని పెంచాలన్నారు. జూన్ చివరి వరకు బస్వాపూర్ రిజర్వాయర్ పూర్తి చేయాలన్నారు. జులై చివరి నాటికి బస్వాపూర్‌కు కాళేశ్వరం నీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

త్రివిధ దళాల సమష్టితత్వం చాలా ముఖ్యం: నేవీ చీఫ్

పుణె, మే 29: : కాలం మారుతున్నా కొద్ది యుద్ధ స్వభావం మారుతూ వస్తున్నదని, ప్రస్తుత పరిస్థితుల్లో త్రివిధ దళాలు పరస్పర సహకారంతో, సమష్టి తత్వంతో పని చేయాలని భారత నావికాదళం చీఫ్ అడ్మిరల్ కరమ్‌బీర్ సింగ్ అభిప్రాయపడ్డారు. శనివారం పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) 140వ కోర్సు పాసింగ్ అవుట్ పెరేడ్‌ను సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు.

భూమి, సముద్రం, గాలి, అంతరిక్షం, సైబర్ స్పేస్ వంటి వాటన్నిటిలోనూ ప్రత్యర్థులను ఎదుర్కోవడం ముఖ్యమని నేవీ చీఫ్ చెప్పారు.

ప్రస్తుత పరిస్థితుల్లో త్రివిధ దళాలు కలిసికట్టుగా, సమష్టితత్వంతో పని చేయవలసిన అవసరం ఉందన్నారు. మన దేశ రక్షణ రంగంలో చాలా ముఖ్యమైన సంస్కరణలు జరుగుతున్నట్లు తెలిపారు. మిలిటరీ అఫైర్స్ డిపార్ట్‌మెంట్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ వ్యవస్థ ఏర్పాటు లాంటివి అందుకు నిదర్శనమని చెప్పారు.

భవిష్యత్తులో యుద్ధం ఏవిధంగా ఉంటుందనే దానితో సంబంధం లేకుండా సమర్థ నాయకత్వానికి కొన్ని వ్యక్తిగత సామర్థ్యాలు, ఆకర్షణలు చాలా ముఖ్యమైనవనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అధికారికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణం నాయకత్వ లక్షణమని చెప్పారు.

పాత్రికేయుల రాతలే కాదు చేతల్లోను మానవత్వమే

250 మందికి ఎస్సీ రాహుల్ హెగ్డే చేతుల మీదుగా పౌష్టికాహారం పంపిణీ

రాజన్న సిరిసిల్ల మే, 29(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడం లో ప్రత్యేక పాత్ర పోషించే పాత్రికేయులు ఒక్క అడుగు ముందుకు వేసి ఆపదలో ఉన్న ప్రజలకు మానవత్వంతో తమవంతు సాయాన్ని అందిస్తూ ముందుకువచ్చిన పత్రికా బృంద సభ్యుల మంచి తనం అభినందించదగ్గ విషయమని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలో ఎస్ 6మీడియా ద్వారా యాచకులకు పౌష్టికాహారాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఎస్ .6మీడియా వారి ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం పై ఆధారపడి బతికే యచకులు 250 మందికి ఈ రోజు పౌష్టికాహారాన్ని పంపిని చేయడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు.అన్నదానాన్ని మించిన మహాదానం మరోటి లేదని, లాక్ డౌన్ సమయంలో నిరుపేదలు, యాచకుల ఆకలి తీర్చాదాంతో పాటు కరోనా మహమ్మారిని తట్టుకునే పౌష్టికాహారాన్ని ఎస్ 6 మీడియా ఛానల్ ప్రతినిధి రాజ్ తిరుమల్ వారి టీం అధ్వర్యంలో పంపిణీ చేయడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. నిరుపేదలకు సేవ చేయడం ఎంతో ఆనందానిస్తుందని,ఇలాగే అందరూ ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.అందరూ కుడా ఎంత మందికి సహాయం చేయవచ్చు అందరికి సహాయం చేయాలని కోరారు. పేద ప్రజల, యాచకుల ఆకలి తీరుస్తున్నా న్యూస్ ఛానల్ ప్రతినిధులను అభినందించారు. అలాగే ప్రతి ఒక్కరూ లాక్ డౌన్ నియమ నిబంధనలు పాటిస్తూ, లాక్ డౌన్ లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ డిఎస్పీ చంద్రకాంత్ ,సి.ఐ వెంకటేష్ ఎస్ 6 మీడియా సభ్యులు యువ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com